## మినీ కథ

# హైలేస... హైలేస!



- రంధి సోమరాజు

వాళ్ళ దగ్గర వీళ్ళ దగ్గర కూర్చొని, సూరిబాబు దినదినం పేపరు చదువుతాడు. రాజకీయాలెప్పుడూ అతని నాలుక చివర ఉంటాయి. కాంగ్రెసు, తెలుగుదేశం పార్టీల గురించి వారి వారి ప్రవృత్తుల గురించి ఎప్పుడూ చక్కని అభిప్రాయాలే చెప్తాడు.

మనిషిని చూస్తే-గంభీరంగానే ఉంటాడు. పాపం నిరుపేద! కిళ్ళీబడ్డీ నడిపే ఓ యువతి దగ్గర అతి తక్కువ జీతానికి జీవితాన్ని తగిలించి లాగించేస్తున్నాడు. ఏమి తింటున్నాడో... ఏమి లేదో...

అడుగడుగునా కష్టాలే... సోడాబుడ్లు ఖర్చు కావడానికి ఐస్ ఫ్యాక్టరీకి పోయి ఐసుదిమ్మలు కొనుక్కొని, జాగ్రత్తగా వాటిని పాడైన సైకిలు ట్యూబుతో సైకిలు కారియర్‌కు లాగికట్టి ఎదురు గాలులకు దిగి లాగుతూ మొత్తానికి సోడాబడ్డీ దగ్గరకు నిత్యం ఆ బరువైన దిమ్మలను చేర్చుతూ ఉంటాడు. మధ్య మధ్యలో ఆ దిమ్మల్ని అరలుగా పావులుగా కొట్టి చిన్ని చిన్ని బడ్డీ దుకాణాలకు అమ్మి తిరిగి ఫ్యాక్టరీకి వచ్చి ఆ అమ్మినంత సరుకూ మళ్ళీకొని తన దుకాణానికి తీసుకొనిపోతాడు. ఓ అరడజను వాడికలు కుదిరినట్లున్నాయి. ఇలా చేయడంవల్ల నిత్యం ఏడెనిమిది రూపాయలు కలిసొస్తాయి. ఇది నిజానికి పెట్టుబడి పెట్టకుండా ఆదాచేసే డాక్టర్ పట్టాభిగారి ప్రక్రియ! మంచిదే...

ఈ పనికి ఫ్యాక్టరీ యజమాని; ఆ సూరిబాబును ఆట పట్టించడం పరిపాటయింది.

'ఏం సూరిబాబూ... మీ షావుకారుణి యిచ్చే జీతంరాళ్ళతో పొట్ట వెళ్ళడం లేనట్లుంది. ఎందుకింత హైరాన! ఈ చివరనుంచి ఆ చివర వరకు ఆ చివరనుంచి ఈ చివరకు ఈ బరువు లాగుతూ... హైలేస... హైలేస...' అంటూ తిరుగుడు కాకినవ్వు-నవ్వుతూ కళ్ళు తిప్పాడు ఫ్యాక్టరీ యజమాని.

'బాగుందండీ మీగోల! యీ కిళ్ళీలకూ, సిగరెట్లకూ - అదే పిట్ట రెట్టలనుకోండి; అంతా గోవిందా...' కిళ్ళీ నోటితో పళ్ళ ఎరుపును మెరిపించాడు సూరిబాబు.

'ఎందుకయ్యా... సముద్రంలో పోస్తావు... మానెయ్యగూడదూ... సుకానికి సుకం ఆదాకు ఆదా...' 'నన్ను చూడు ఇలాంటి ఖర్చు లేవీ లేవు' అన్నాడు ఆ ఫ్యాక్టరీ పెద్దోడు.

సూరిబాబు ఐసు దిమ్మల్ని గట్టిగా బలంగా సైకిలు పైకి కడ్తూ, 'నిజమండీ... మానలేకపోతున్నాను. ఏటో అనుకుంటాంకాని కొన్ని కొన్ని మానలేం... మాట వరసకు మీరే చూడండి... హిందూ కొంటారు, తెలుగులో రెండు దినపత్రికలు కొంటారు. వారం వారం వచ్చే పుస్తకాలు కొంటారు. ఇవి చాలక నెల నెలా వచ్చేవి కొంటారు. ఇవి చాలదన్నట్టు యించుమించు రోజూ సినిమాలు చూస్తారు. ఇవన్నీ మానేస్తే ఎవరికైనా బోలెడు మిగులే... పెద్దగా వార్తలు చదవకపోతే, సినిమాలు చూడకపోతే కొంపమునిగిపోదు కదా... కాని ఉండలేం... మరి ఈ ఖర్చులూ అంతేసార్... అలా అవుతూనే ఉంటాయి. కొన్ని కొన్ని తప్పించుకోలేం... అలా ఖర్చుల్లో తడుస్తూ ఉంటేకాని మనసు పచ్చబడదేమో! ఇదేనండీ జీవితం!' అంటూ గొప్ప సూరి వేదాంతాన్ని సంగీతంలా వినిపించి, సైకిలు ఈడ్చుకపోయాడు. సన్నగా నవ్వుతూనూ ఉన్నాడు. ఆరిపోయిన దివిటీలా ముసలి ప్రొప్రయిటరు వేదాంతం వంటబట్టేసి అలాగే నల్లగా మిగిలిపోయాడు!

*